అద్దె భవనాల్లో అవస్థలు

- మండలంలో అద్దె భవనాల్లో కునారిల్లుతోన్న అంగన్‌వాడీ కేంద్రాలు
- 69 కేంద్రాల్లో 46 అద్దె భవనాలే..
- మూడు నెలలుగా అద్దె చెల్లించింది లేదు.. ఆటపాటలకు వస్తువులూ లేవు
- పెరిగిన కూరగాయలు, నిత్యావసరాల ధరలతో బెంబేలు
- పట్టించుకోని ప్రభుత్వం


మండలంలో అద్దె భవనంలో నడుస్తున్న ఓ అంగన్‌వాడీ కేంద్రం

ఫిరంగిపురం: చిన్నారుల మనోవికాసానికి దోహదపడే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. పిల్లలకు సరైన ఆట వస్తువులు లేక, ప్రభుత్వం నుంచి అద్దెలకు సంబంధించి బిల్లులు రాక, పెరిగిన కూరగాయల, నిత్యావసర ధరలు వంటి సమస్యలతో అంగన్‌వాడీ కేంద్రాలు కొట్టుమిట్టాడుతున్నాయి.

69 అంగన్‌వాడీ కేంద్రాలు..

ఫిరంగిపురం ఐసీడీఎస్ సెక్టారు పరిధిలోని మండలంలోని 18 గ్రామాల్లో మూడు సెక్టార్లు అమీనాబాద్, ఫిరంగిపురం, మేరికపూడి సెక్టార్ల పరిధిలో 69 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 46 వరకు కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగిలిన కేంద్రాలు ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.

ఆట వస్తువుల ఊసేలేదు..

విద్యా సంవత్సరం ప్రారంభమై 6 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రీ స్కూల్ మెటీరియల్‌లో భాగంగా విద్యార్థులకు ఆటలు ఆడించేందుకు వీలుగా అవసరమైన ఆటసామగ్రి ఇంతవరకు రాలేదు. గతేడాది ఇచ్చిన మందులు కిట్ తప్ప మళ్లీ ఈ ఏడాది పిల్లల అవసరాలకు పనికి వచ్చే పారాసిట్‌మాల్, ఐయోడిన్, కాటన్, ఐడ్రాప్స్ వంటి ప్రాథమిక కిట్ మరలా ఇవ్వలేదు.

చాలీచాలనీ కూరల బిల్లులు...

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి చిన్నారికి కూరగాయలు, వంటగ్యాస్ కోసం ఇచ్చే రూ.2 చాలక, బిల్లులు సక్రమంగా రాక అంగన్‌వాడీలు ఇక్కట్లు పడుతున్నారు. కూరగాయల ధరలు బాగా పెరిగిపోవడం, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. మెనూ అమలు చేసేందుకు అంగన్‌వాడీలు అవస్థలు పడుతున్నారు. కేంద్రాలకు ప్రభుత్వమే బియ్యం, నూనె, కందిపప్పు, పాలు, గుడ్లు అందజేస్తోంది. అయితే కూరగాయలు, మిగిలిన సామగ్రిని కార్యకర్తలే పెట్టుబడిగా పెట్టుకోవాలి, ఒక్కో చిన్నారికి రూ. 1.50పైసలు ప్రభుత్వం చెల్లిస్తుంది, గ్యాస్‌కు 0.50పైసలు మాత్రమే ఇస్తారు. దీంతో పెట్టుబడిగా పెట్టిన వాటికి నెల నెలా బిల్లులురాక పోవడంతో కార్యకర్తలు సతమతమవుతున్నారు. పెరిగిన కూరగాయల ధరలు, గ్యాస్ సిలెండర్ల ధరలతో బెంబేలు పడుతున్నారు.


పాడైపోయిన ఆట వస్తువులు

పాడైయిన బీరువాలు..

పుస్తకాలు, ఆట వస్తువులు, మందులు కిట్లు దాచి పెట్టేందుకు ఎన్నో ఏళ్ల కిందట ఇచ్చిన బీరువాలు పాడై పోయాయి. దీంతో కేంద్రాల్లో బయటనే వాటిని పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతినెలా రాసే 15 రిజిస్టర్లు సైతం అంగన్‌వాడీ కార్యకర్తలే కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది, అలాగే అద్దె భవనాల స్థానంలో భవనాలు నిర్మించడం లేదా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- అద్దె భవనాలకు రావాల్సిన బకాయిల గురించి ఐసీడీఎస్ సీడీపీఓ పి. ప్రసూనను వివరణకోరగా సెప్టెంబరు నుంచి బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. పీపీ-1 పీపీ-2 మెటీరియల్ వచ్చినట్లు చెప్పారు.

క్లుప్తంగా

మైనార్టీల హక్కులను కాపాడుకోవాలి



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): మైనార్టీల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని అన్నారు. మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని తన చేతుల్లోకి తీసుకోవాలనే దురుద్దేశ ధోరణితో చట్టంలో 40 సవరణలు చేసేందుకు వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిందన్నారు. వక్ఫ్‌బోర్డు అధికారాలను తగ్గించడంతో పాటు ముస్లిమేతరులను బోర్డులో చేర్చాలనే ప్రతిపాదన సరికాదన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఈ వక్ఫ్ సవరణ బిల్లు దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రద్దు చేసి నమైనార్టీల స్కాలర్‌షిప్‌ను కేంద్రం తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో హక్కులపై ప్రతి ఒక్కరు స్పందించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. షేక్ రషీద్, షేక్ జాన్ సైదా, షేక్ జిలానీ, పఠాన్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

'ఏపీఎస్పీ'లో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు



మంగళగిరి: ఏపీఎస్పీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్‌లో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ముఖ్య అతిథిగా హాజరై 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్స్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి సమాజం కోసం కృషి చేసిన పెన్షనర్స్‌ను సత్కరించడం సంతోషకరమన్నారు. పెన్షనర్లు ప్రశాంత జీవితం గడిపేందుకు సహకరించాలన్నారు. ఏపీఎస్పీ కమాండెంట్ పి.నగేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్స్ యు.రవి, జనార్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అసోషియేషన్ అధ్యక్షుడు తాటి కృష్ణారావు నాయుడు, పావనరావు, వీకే గోవర్ధన్, ఎంఎస్‌కె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరులో అధ్వాన పారిశుద్ధ్యం



తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో తాడేపల్లి రూరల్ చిర్రావూరు గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. చిర్రావూరు మొత్తం 4వేలకు పైగా జనాభా ఉండగా మొత్తం కలిపి 15 రహదారులు కూడా ఉండవు. ఆ రహదారుల్లో డ్రైనేజీ తీసేవారు లేక డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం వల్ల దోమల వృద్ధి చెందుతున్నాయని, ఎంతో మంది అనారోగ్యాల పాలవుతున్నారని వెంటనే సంబంధిత అధికారులు చిర్రావూరులో డ్రైనేజీల పూడిక తీయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

22 నుంచి తెనాలిలో ఉచిత యోగా శిబిరం

తెనాలిఅర్బన్: శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఉచిత యోగ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యోగ గురువు తాడికొండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బోసురోడ్డులోని శ్రీకన్యక పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు జరిగే యోగ శిబిరాన్ని మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ప్రారంభిస్తారని చెప్పారు. 21 రోజుల పాటు దీనిని నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 94407 12208లో సంప్రదించవచ్చన్నారు.

'ఎన్‌ఆర్‌ఐ'లో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో పాల్గొన్న మేడికొండూరు సీఐ నాగూర్ మీరాసాహెబ్

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల అడ్డరోడ్డులో ఉన్న ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో 'సైబర్ నేరాలు వాటి కారణాలు - వాటి నుంచి తప్పించుకోవడం ఎలా' అనే అంశంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడికొండూరు సీఐ ఎస్.కె. నాగుర్ మీరా సాహెబ్ హాజరయ్యారు. సైబర్ నేరగాళ్లు ఎన్నిరకాలుగా ప్రజలను మోసగిస్తున్నారు, వారి నుంచి ఏ విధంగా రక్షణ పొందాలో తదితర వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్ తో గడపడం నేరాలు పెరగడానికి ఒక కారణంగా చెప్పారు. మహిళలు, విద్యార్థినులు ఆన్‌లైన్‌లో స్నేహాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బ్యాంక్ ఖాతాల వివరాలు ఎవరికీ చెప్పకూడదన్నారు. రాంగ్ కాల్స్, బ్యాంకు డిటైల్స్ చెప్పమని ఫోన్‌కాల్స్ వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనవసర లింకులను ఓపెన్ చేయడం ద్వారా ఫోన్ హ్యాక్ అవుతుందన్నారు. మేడికొండూరు ఎస్ఐ, స్టెప్ ఆర్గనైజేషన్ సీఈఓ రాధిక తదితరులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు, సివిల్ హెచ్ఓడీ చంద్రమౌళి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండాలపాడులో రెవెన్యూ సదస్సు


మాట్లాడుతున్న తహసీల్దార్ జె.ప్రసాదరావు

ఫిరంగిపురం: మండలంలోని గుండాల పాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో అడంగల్ మరియు పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి 8 అర్జీలు, భూమి కొలతలకు సంబంధించి ఒక అర్జీ, మొత్తం 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. సదస్సులో ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, షేక్.ఫరీద్ బాష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడులో...

పాములపాడు(తాడికొండ): తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 29 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కె.నాసరయ్య తెలిపారు. ఇందులో రెవెన్యూ సంబంధిత అడంగల్, పాసు పుస్తకం రీ ప్లేస్‌మెంట్‌కు సంబంధించి 9 దరఖాస్తులు రాగా సర్వే సంబంధిత సమస్యల కోసం 19 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సదస్సులు చక్కటి పరిష్కారమన్నారు. ప్రతి గ్రామంలో రైతులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, ఆర్ఐ హనుమంతరావు, సర్వేయర్ నాగరాజు, వీఆర్వో రవిబాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీ


విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, భువన్

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గారమంలో గల సంఘిక సంక్షేమ హాస్టల్ (1)ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థుల వసతులను పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. విజిటర్స్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతకం చేశారు. చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల తహసీల్దార్ దృష్టికి వచ్చింది. దీంతో తన మిత్ర బృందమైన ఎన్జీవో సంఘ నాయకులు బి. కృష్ణమోహన్, కూనపెరెడ్డి శ్రీనివాసరావు తదితరులతో కలసి ఇదే విషయాన్ని పట్టణానికి చెందిన కాంట్రాక్టరు సూర్యదేవర భువన్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు. హాస్టల్ తనిఖీకి వెళ్లిన సందర్భంగా విద్యార్థులకు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లు, దిండ్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేసి, హాస్టలుకు ఫ్యాన్లు, లైట్లను సమకూర్చారు. వీటిని తనిఖీ సందర్భంగా వీరు అందజేశారు. రానున్న రోజుల్లో అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తామని, అక్కడ ఉండే పేద విద్యార్థులకు తమమిత్ర బృందం, దాతల సాయంతో కనీస అవసరాలను కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా దాత భువన్‌ను సత్కరించి అభినందించారు.

మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయండి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి


రికార్డులు పరిశీలిస్తున్న ఏసీ లక్ష్మీ పతి

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వలో వ్యర్థాలు పెరుకుపోయి పారుదలకు అవరోధంగా మారుతున్నాయని, వాటిని ప్రతిరోజ తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 11,16,37 వార్డులలో బుధవారం ఆయన ఉదయం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. కాల్వల్లో వచ్చిన వ్యర్థాలను వెంటనే బయటకు పంపే విధంగా చూడాలన్నారు. అలాగే ప్రతిరోజు సేకరించే చెత్త వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పలువురు శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఎస్ఏ పరీక్షా ప్రశ్నపత్రాల లీకేజీపై చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ డిమాండ్


కమిషనర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

మంగళగిరి: ఎస్ఏ పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకోవాని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం (వైఎస్సార్ ఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శించి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మాట్లాడుతూ ఎస్ఏ-1 పరీక్ష ప్రారంభమైన గంటలోపే ఆన్‌లైన్‌లో పరీక్షాపత్రం ఎలా బయటకు వచ్చిందని ప్రశ్నించారు. విద్యాశాఖ కార్యాలయం నుంచి సీల్డ్ కవర్‌లో పాఠశాలకు వెళ్లాల్సిన ప్రశ్నాపత్రం ఆన్‌లైన్‌లోకి ఎలా వచ్చిందని నిలదీశారు. అర్ధ సంవత్సరం పరీక్షలు సరిగా నిర్వహించలేని ప్రభుత్వం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత ఐదు సంవత్సారాల పాలనలో ఒక్కసారి కూడా ప్రశ్నాపత్రాలు లీకు కాలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లోనే ప్రశ్నా పత్రం లీకు కావడం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ శాఖపై ఎలాంటి అజమాయిషీ ఉందో తెలుస్తుందన్నారు. నాడు-నేడుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాశాఖను పటిష్టం చేయగా నేడు టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీరం చేస్తుందన్నారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.శివారెడ్డి, ఐ.శ్రీనివాస్, పురుషోత్తం, విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



ఫిరంగిపురం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఇస్తున్న రెండురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో భాగంగా అవసరమైన ప్రణాళికలు ప్రతి గ్రామ పంచాయతీలో రూపొందించుకోవాలని సూచించారు. ఈఓపీ ఆర్డీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ సుదర్శన్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషాల పండుగ క్రిస్మస్



తెనాలిరూరల్: క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ సంతోషంతో జరుపుకునే పండుగ అని రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణానికి చెందిన ఈరే మినిస్ట్రీస్, ది తెనాలి యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు స్థానిక ఐతానగర్‌లోని స్టేట్ బ్యాంక్ సమీపంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ కె. సుధీర్‌కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మనోహర్ మాట్లాడుతూ లోక రక్షణ కోసం ప్రభువైన ఏసుక్రీస్తు జన్మించిన సందర్భంగా జరుపుకునే ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఆయన బోధనలను అనుసరించాలన్నారు. క్రీస్తు పుట్టుక లోకానికి పండుగ అని, ప్రతి ఒక్కరు పండుగ సంతోషంలో భాగస్వాములు కావాలని కోరారు. యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్, ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఈడీ ఎ. కోటేశ్వరరావు, ఆర్టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ టి. శోభమంజరి, రెవ.ఎ. భానుప్రసాద్, రెవ కూచిపూడి అబ్రహాం, బిషప్ జె. ప్రభుదాస్, బ్రదర్ పి. ఐజక్, రెవ డి. మార్టిన్‌లూథర్‌బాబు, పాస్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల పెంపు దారుణం

సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం

తాడేపల్లిరూరల్: పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను బిగించవద్దని డిమాండ్ చేస్తూ సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం దుగ్గిరాలలోని లూథరన్ చర్చి ఆవరణలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దొంగచాటుగా స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని అన్నారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలో వున్న సమయంలో బషీరాబాద్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని ఒక్కసారి ముఖ్యమంత్రి చంద్రబాబు మననం చేసుకోవాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ.16 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, జి. శ్రీనివాసరావు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.చిరంజీవి, భాస్కరరావు బుజ్జి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ చాంపియన్‌గా అత్తోట హార్దీ


బహుమతులతో అత్తోట హార్దీ

తెనాలి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగిన యూసీ మాస్ అబాకస్ పోటీల్లో తెనాలికి చెందిన అత్తోట హార్దీ రెండు స్థాయిల్లోనూ ఛాంపియన్‌గా నిలిచాడు. ఢిల్లీలోని ఢిల్లీ యూనివర్శిటీలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో ఆరువేల మంది పాల్గొన్నారు. విదేశీ కేటగిరీలో 30 దేశాలు పాల్గొన్నాయని, ఈ పోటీల్లో పాల్గొన్న హార్దీ లెవెల్-ఏ2లో రెండింటిలోనూ ఛాంపియన్‌గా సత్తా చాటినట్టు హార్దీ తండ్రి ప్రమోద్ బుధవారం సాయంత్రం ఇక్కడ తెలియజేశారు. స్థానిక అయితానగర్‌కు చెందిన హార్దీ, కొల్లూరులోని ఫోర్‌ఫ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. అద్భుతమైన వేగం, ఖచ్చితత్వంతో సంక్లిష్టమైన అబాకస్ సమస్యలను పరిష్కరించి, తన నైపుణ్యాన్ని చాటినట్టు తెలిపారు. 15వ తేదీ సాయంత్రం కేంద్ర మంత్రి మీనాక్షి లేకి చేతులమీదుగా బహుమతులను అందుకున్నట్టు వివరించారు. మంగళవారం రాత్రి తెనాలి చేరుకున్న అబాకస్ బాలమేధావి హార్దీకి, రైల్వేస్టేషనులో కుటుంబసభ్యులు, బంధువులు ఘనంగా స్వాగతం పలికారు.

'డీప్ ఫేక్ టూల్స్'తో సవాళ్లను అధిగమించొచ్చు

వీఐటీ- ఏపీలో డీప్ ఫేక్ టూల్స్ టెక్నిక్స్, ఎథికల్ ఇంప్లికేషన్స్‌పై శిక్షణా కార్యక్రమం



తాడికొండ: డీప్ ఫేక్ టూల్స్ టెక్నాలజీతో సవాళ్లను సులభంగా అధిగమించవచ్చని ప్రొఫెసర్ డాక్టర్ సచినందన్ మొహంతి అన్నారు. బుధవారం వీఐటీ-ఏపీ విశ్వ విద్యాలయంలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఐఈఈఈ కంప్యూటేషనల్ ఇంటిలిజెన్స్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ సంయుక్తంగా డీప్ ఫేక్ టూల్స్, టెక్నిక్స్, ఎథికల్ ఇంప్లికేషన్స్ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు డీప్ ఫేక్ టెక్నాలజీలో అభివృద్ధి చెందుతున్న సవాళ్ళు, అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి 70 మంది ఔత్సాహికులు పాల్గొనగా స్కోప్ డీన్ డాక్టర్ సుధాకర్ ఇలాంగో, ఏఐ మరియు ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ రీజా పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బీవీ సతీష్ కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ బీవీ సతీష్ కుమార్

మోతడక(తాడికొండ): ఫార్మసీ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బీవీ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ కోర్సు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యం, ఫిట్‌నెస్, మైండ్ మ్యాపింగ్, కెరీర్, ఆధ్యాత్మికత, సర్కిల్, స్పేస్, మైహోమ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు తరచూ తమ పిల్లలను పర్యవేక్షించాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని, టెక్నాలజీతో పోటీ పడుతూ సెల్‌ఫోన్, కంప్యూటర్లను అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని స్మార్ట్ క్లాస్‌రూమ్‌లో స్మార్ట్ యాక్టివిటీలు అధునాత పద్ధతుల ద్వారా బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.వెంకట రామారావు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.